క్లుప్తంగా

నేడు 113తాళ్లూరులో సుచరిత ప్రచారం

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, గరుడాచల పాలెం, వేమవరం గ్రామాల్లో బుధవారం తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి మంగళవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచార కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఫిరంగిపురం పీహెచ్‌సీలో వైద్యశిబిరం



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సచివాలయం-3 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 321 మందికి వైద్యురాలు శ్వేత వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. వేసవిలో గర్భిణులు, బాలింతలు, ముసలివారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం భారతీజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి నేతలకు తగిన బుద్ధి చెప్పాలి

నెహ్రూ నగర్: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టిన కూటమి నేతలు అడ్డుపడటం సిగ్గుచేటని, 13న జరగనున్న ఎన్నికల్లో కూటమి నేతలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా మాదిగ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా వైద్య రంగాల్లో సీఎం జగన్ తీసుకువచ్చిన విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి నేతలు తమ స్వార్థం కోసం ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని ఉద్దేశంతో నీచ రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నెహ్రూ నగర్: ఎన్నికల్లో ఓపీఓ విధులు కేటాయించబడిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌ని 3వ రోజు 1,147 మంది ఉద్యోగులు సద్వినియోగం చేసుకున్నారని, అందుకు తగిన విధంగా అసౌకర్యం కల్గకుండా, హెల్ప్ డెస్కులు, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం స్థానిక ఏసీ కాలేజ్‌లోని ఫెసిలిటేషన్ సెంటర్‌ని పరిశీలించి, పోస్టల్ బ్యాలెట్‌కి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అనువుగా ఏసీ కాలేజ్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో తూర్పు నియోజకవర్గానికి 2, ఇతర నియోజకవర్గాలకు మరో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. తూర్పు నియోజకవర్గం ఓటింగ్‌కు 5 కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మంగళవారం ఓపీఓలు 1,147 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారన్నారు. 5,6,7 తేదీల్లో తూర్పు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1723 మంది ఓటు వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

నేడు విజయవాడలో నరేంద్ర మోదీ రోడ్ షో

గుంటూరు మెడికల్: విజయవాడలో ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోసం బుధవారం రోడ్ షో నిర్వహించనున్నట్లు బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్‌షో పీవీఆర్ మాల్ నుంచి బెంజ్ సర్కిల్ వరకు సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందన్నారు. రోడ్‌షోలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు.

నైపుణ్యాలతో ప్రతిభ నిరూపణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను వెలికితీసినప్పుడే ప్రతిభను నిరూపించుకుని ఉద్యోగాలను సాధించగలరని వేద విజ్ఞాన అకడమిక్ రీసెర్చ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ వి. జ్ఞానసాగర్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, హ్యూమనిటీస్ విభాగాధిపతి డాక్టర్ కె.విజయభాస్కర్, సీహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే మైనార్టీలకు మేలు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు



తాడేపల్లిలో ముస్లిం సోదరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని మార్కెట్ సెంటర్‌లో ఉన్న జామియా మసీదులో మంగళవారం మంగళగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య ముస్లిం సోదరులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా జామియా మసీదు ఇమామ్ మరియు మతపెద్దలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు ఫ్యానుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే ఆ రిజర్వేషన్ రద్దయ్యే ప్రమాదముందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తూ ఉప ముఖ్యమంత్రి పదవి కేటాయించారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం రావాలంటే అది జగన్‌మోహన్ రెడ్డి వల్లే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకులు ఎండీ గోరె, జామియా మసీదు అధ్యక్షులు షఫీవుల్లా బేగ్, కార్యదర్శి షేక్ ఖాసిం, మత పెద్దలు సయ్యద్ సయూద్, ఖలీల్, షేక్ గాలిబ్, ఎండీ సర్దార్, రహమాన్ బేగ్, కరీం బేగ్, షేక్ జానీ, ఎండీ రబ్బాని, ఉమర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం



ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ ప్రచారం నిర్వహిస్తున్న పలుకూరి మేరమ్మ, నాయకులు

తాడేపల్లిరూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యల ఎన్నికల గుర్తు ఫ్యానుపై ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరుతూ రేవేంద్రపాడులో సర్పంచ్ పలుకూరి మేరమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలుకూరి మేరమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు మన ఇంటి వద్ద నుంచి అందుకునే విధంగా చేశారని అన్నారు. దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, డొంక రోడ్లు నిర్మించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కారణంగానే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోగంటి రవిచంద్, పలుకూరి శ్యామల, మొండితోక వెంకట సుబ్బయ్య, కొప్పుల ప్రకాష్, కనపర్తి సాంబశివరావు, కొప్పుల జాకబ్, శిఖా సుబ్బారావు, మొండితోక యోహాన్, గొంగటి సుధాకర్, కొప్పుల కిరణ్, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకుందాం

మాదిగ మహాసేన అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న మాదిగ మహాసేన అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్

తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ మాదిగ మహాసేన అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యటన మంగళవారం దుగ్గిరాల మండలం పెద కొండూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మాదిగలు అంతా వైఎస్సార్ సీపీకి సంఘీభావం తెలియ జేస్తున్నారని అన్నారు. మాదిగలు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యలను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహాసేన గుంటూరు జిల్లా అధ్యక్షులు కూచిపూడి గోపి, గుద్దేటి జోషి, కొండూరు భాను ప్రసాద్, మాదిగ మహాసేన మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు కొండూరు కిరణ్ బాబు, కుక్కమళ్ల సంజయ్‌కుమార్, కొండూరు శేషయ్య, గ్రామ కన్వీనర్ కొండూరు కిషోర్ కుమార్, గ్రామ అధ్యక్షులు కొండూరు రవి, 2వ వార్డు మెంబర్ మరియదాసు, కొండూరు సుబ్బారావు, ఎస్సీ రైల్వే గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు కొదమల వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ ఫలితాలు సత్వరమే అందించాలి

డాక్టర్ కిరణ్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిపై నమ్మకంతో వస్తున్నా రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలను సత్వరమే అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, పెథాలజీ వైద్య విభాగాధిపతులతో లేబొరేటరి పరీక్షలు వాటి ఆవశ్యకతపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి రోజుకు నాలుగు వేల నుంచి ఐదు వేల మంది వరకు రోగులు వస్తున్నారని వివరించారు. అందులో రెండు వేల మంది రోగులు ఇన్ పేషంట్‌గా ఉంటున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో గుండె ఆపరేషన్లు, కిడ్నీ, కాలేయం వంటి ఆపరేషన్లు జరుగుతున్నాయని ఈ పరిస్థితులలో ల్యాబ్ పరీక్షలు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలు నిక్కచిగా అందించాలన్నారు. ఆస్పత్రిలో రోగులు 30 నుంచి 40 మందికి పైగా వెంటిలేటర్ పై ఉంటున్నారని తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు జరగాలని ఆదేశించారు. ఆస్పత్రి నుంచి రక్త నమూనాలు బయటకు వెళుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని దానికి తోడు ఆస్పత్రిపై దుష్ప్రచారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఆసుపత్రికి, మెడికల్ కళాశాలకు చెడ్డ పేరు తీసుకుని రావద్దని కోరారు. అందుబాటులో ఉన్న రక్త వ్యాధి నిర్ధారణ పరీక్షలు సత్వరమే చేసి రోగి కోలుకునే విధంగా సహకరించాలన్నారు.

పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు ప్రయోజనం



మాట్లాడుతున్న హెచ్‌ఆర్ ఫుట్ ప్రింట్స్ సీఈవో రాజ్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలతో పాటు వ్యవస్థాపకులుగా ఎదిగే క్రమంలో ప్రయోజనాలు ఉంటాయని హెచ్‌ఆర్ ఫుట్ ప్రింట్స్ సీఈఓ డాక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా సంస్థలను అనుసంధానించడం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న రాజ్‌కుమార్ మాట్లాడుతూ తాము అకడమిక్‌గా అధ్యయనం చేసిన అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించేలా క్షేత్రస్థాయిలో శిక్షణ పొందడమే ఇంటర్న్‌షిప్ అని అన్నారు. తద్వారా విద్యార్థులకు పరిశ్రమల్లోని క్షేత్ర పరిస్థితులపై అవగాహన పొందడమే కాకుండా నైపుణ్యాలు చేకూరుతాయన్నారు. వీటితో పాటు అంతర్గత నైపుణ్యాలు, టీం వర్క్, పనిలో నైపుణ్యం, నిర్ణయాధికారం, సమస్యను పరిష్కరించే నైపుణ్యాలు దక్కుతాయన్నారు. ఇంటర్న్ ట్రైనీగా చూపే ప్రతిభ, పనితీరు సంస్థ యాజమాన్యం మెచ్చే విధంగా ఉంటే పూర్తి స్థాయిలో ఉద్యోగం లభిస్తుందన్నారు. అనంతరం ఇంటర్న్‌షిప్, ప్రాంతీయభాష, బృందంతో కలసి పని చేసే సమయంలో పైస్థాయి అధికారులతో నడుచుకునే విధానాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పరిశ్రమలు తమ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, ఎస్. గోపి శ్రీనివాసరావు, సీహెచ్ వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, ఎన్. మణికంఠ, బి.అనిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆధ్వర్యంలో చలివేంద్రం



నెహ్రూనగర్: గుంటూరు ఈస్ట్ 1 సెక్టార్ అంగన్‌వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ చర్చి వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సదుపాయం కల్పించారు. ఎండ వేడిమికి ఇబ్బందులు కలగకుండా అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో చలివేంద్ర నిర్వహణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎన్ఎస్ తబిత పాల్గొన్నారు.

బడేపురంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం



బడేపురంలో ప్రచారం నిర్వహిస్తున్న బెజ్జం సాయి ప్రసాద్, నాయకులు

బడేపురం(తాడికొండ): తాడికొండ మండలం బడేపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు బెజ్జం సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచార కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని ఇంటింటికీ తిరిగి బ్యాలెట్ నమూనా అందజేశారు. ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా మేకతోటి సుచరిత, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు జాతి స్ఫూర్తి ప్రదాత అల్లూరి

లక్ష్మీపురం: అల్లూరి సీతారామరాజు తెలుగు జాతి స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక నాజ్ సెంటర్‌లోని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి మంగళవారం నిర్వహించారు. త నాజ్ సెంటర్‌లోని అల్లూరి సీతారామరావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అమరుడై వందేళ్లు అయిందని ఆయన నేతృత్వంలో ఆదివాసీల మౌలిక సమస్యల పరిష్కారం కోసం బ్రిటీష్ పాలన అంతం కోసం 1922 ఆగస్టు నుంచి 1924 జూన్ వరకు విశాఖ, గోదావరి మన్య ప్రాంతంలో మహోధృత పోరాటం జరిగిందన్నారు. మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడి నివాళులర్పించారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



లక్ష్మీపురం: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని తెలుగు పండిట్ రాజన్న మాస్టారు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఓటరు చైతన్య సభ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పవిత్రమైనదని, పరిపాలన విధానానికి ఆయుధం లాంటిదన్నారు. విశ్రాంత జంతుశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ ఆర్.రామచంద్రరావు, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ చాలామంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా, రాజకీయ తంతుగా భావిస్తున్నారని అది సరికాదని చెప్పారు. స్వార్థ రాజకీయాల కోసం కోట్ల రూపాయలు వెదజల్లే వారిని ప్రజాప్రతినిధులు కాకుండా అడ్డుకోవటానికి ఓటే శక్తివంతమైన ఆయుధమని చెప్పారు. కార్యక్రమంలో రవి మెడికల్స్ శివశంకరరావు, సంస్థ సీనియర్ సభ్యులు ఎన్. విద్యాధర కుమార్, సి.హెచ్.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు.

ప్రశాంత వాతావరణాన్ని కల్పించండి

చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. చేబ్రోలు మండలం గుండవరంలోని ప్రభుత్వ పాఠశాల, గొడవర్రు యూపీ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలు, బందోబస్తు ఏర్పాట్లపై చేబ్రోలు ఎస్సై మహేష్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగు కేంద్రాల వద్ద బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర విధివిధానాలపై క్షుణ్ణంగా పరిశీలించి మార్గనిర్దేశనం చేశారు. పోలింగ్ రోజున కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారు మినహా ఎవరూ ఉండకుండా చూడాలని తెలిపారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, టోల్ ఫ్రీ నంబర్ 112కు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి వెంట శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, స్థానిక ఎస్ఐ పి మహేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కడదాం

- తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత కుమార్తె రిషిక
- తుళ్లూరు మండలం వెలగపూడిలో ఇంటింటి ప్రచారం



తుళ్లూరు ప్రచారంలో మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న రిషిక

ప్రచార పర్వం

వెలగపూడి(తాడికొండ): సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటి వద్దకు చేరాలంటే సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కుమార్తె రిషిక అన్నారు. తుళ్ళూరు మండలం వెలగపూడి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంటింటికీ తిరిగి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన తల్లి సుచరితకు, ఎంపీగా పోటీ చేస్తున్న వెంకట రోశయ్యకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సుచరిత కుమార్తె రిషికకు వెలగపూడి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికీ వెళ్లిన ఆమెను ఆశీర్వదించి జగనన్నను గెలిపించు కునేందుకు తాము సిద్ధమని స్థానికులు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా సంక్షేమ పథకాలను పేదల చెంతకు చేర్చి ఒక్క రూపాయి అవినీతి లేకుండా ఖాతాల్లో పడేలా పాలన అందించిన జగనన్నకు ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గ్రామాల్లో వస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా పాలన అందించిన జగనన్న రాబోయే ఎన్నికల్లో 175/175 స్థానాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చలివేంద్రం సురేష్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి బొర్రా వెంకట శివారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం సహాయ కార్యదర్శి సలివేంద్ర కార్తీక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కావు రమేష్, యువజన విభాగం అధ్యక్షుడు రావూరి కిషోర్, గోచిపాత నాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలను వివరిస్తున్న నిపుణులు శివనాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాల బాలికలకు కంప్యూటర్ సైన్స్‌లో మెళకువలపై ఇస్తున్న ప్రత్యేక శిక్షణా శిబిరం మంగళవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కేఎల్‌యూ గ్లగ్ ఇన్‌చార్జి ఆచార్య కె.శ్రీపతి రాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 7, 8 తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్‌లో మెళకువల గురించి ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మొత్తం 200 మంది బాల బాలికలు హాజరయ్యారని తెలిపారు. కంప్యూటర్ బేసిక్స్, డిజైనింగ్, లాజిక్ ప్రోగ్రామింగ్‌తో పాటు కథలు చెప్పడం, లాజికల్ రీజనింగ్ వంటి మరెన్నో ఆక్టివిటీస్ నిర్వహిస్తున్నామన్నారు. లిటిల్ సైన్స్ ఎక్స్‌పర్‌మెంట్స్ నుంచి శివనాగేశ్వరరావు ఈ శిబిరంలో పాల్గొని బాల బాలికలకు చిన్న చిన్న సైన్స్ సూత్రాలను వివరిస్తున్నారని వివరించారు. సైన్స్ ప్రయోగాలను ఇంట్లో ఎలా చేసుకోవచ్చో వివరిస్తున్నారని తెలిపారు. వీటితో పాటు మ్యాజిక్ ఎలా పనిచేస్తుంది? లాజిక్కులు, కథలు చెప్పడం వంటి అంశాలను మంగళగిరి విశ్రాంత ఎంపీడీవో ఆదినారాయణ పిల్లలకు వివరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజర్లుగా ఖ్యాతి, కార్తీక్, నిఖిత, శ్రీజ, రవి, సూర్య, సాత్విక్, తేజ, సాయి, జితేందర్, అనూష, గాయత్రిలు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్లు, వలంటీర్లను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావులు అభినందించారు.

నైపుణ్యాలతో ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో రామకృష్ణ ప్రభు, రాఘవరావు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతో పాటు నైపుణ్యాల ద్వారా ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని గుంటూరు చలమయ్య- కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో మంగళవారం వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన 40 మంది విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడం గొప్ప విషయమని, జాతీయ స్థాయిలో ఉన్న పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలను పొందడం విద్యార్థుల అదృష్టమని అన్నారు. కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించి, చదువుకున్న కళాశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. సంయుక్త కార్యదర్శి మాజేటి ప్రసాద్ మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వం పై ఆధారపడక ప్రైవేటు రంగంలో సైతం సమర్థత కలిగిన సంస్థల్లో చేరి జీవితంలో స్థిరపడాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, కోశాధికారి జయప్రకాష్, కర్పూరపు సూర్యనారాయణ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఏ శ్రీధర్, ప్లేస్మెంట్ అధికారి చంద్రశేఖర్, అధ్యాపకులు లక్ష్మీ శుభద్ర, అరుణ కుమారి, భవానీ దుర్గ, ఇందిరా, మల్లేశ్వరి, రాజరాజేశ్వరి పాల్గొన్నారు .

ఏఎన్‌యూ నేపాల్ వర్సిటీతో ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను వీసీ ఆచార్య రాజశేఖర్‌కు అందజేస్తున్న ఉదయకుమార్, మధుబాబు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బౌద్ధ అధ్యయన విభాగం నేపాల్‌లోని లుంబినీ బుద్ధిస్ట్ యూనివర్శిటీతో ఎంఓయూ(అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. ఈనెల 4,5 తేదీలలో నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఏఎన్‌యూ బుద్ధిజం విభాగాధిపతి ఆచార్య ఎల్. ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లుంబినీ యూనివర్సిటీతో ఏఎన్‌యూకి ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఎంఓయూ పత్రాలను మంగళవారం ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌కు ఉదయకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ రెండూ యూనివర్సిటీల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య సాహిత్య, సంస్కృతిక, మేధపరమైన అంశాలపై విస్తృత పరిశోధనలు జరగాలన్నారు. బుద్ధిజంపై విస్తృతంగా అధ్యయనం, పరిశోధనలు చేసే అవకాశం ఉంటుందని ఆచార్య ఉదయకుమార్ తెలిపారు. రెండు యూనివర్సిటీలు పరస్పర అవగాహనతో విద్యా, పరిశోధనలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య సంధ్యాకోల్, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌కేబీఎం పాఠశాల తనిఖీ

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్ నగరంపాలెం పీఎస్ పరిధిలోని ఏటీ అగ్రహారం 10 వీధిలో ఉన్న ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈనెల 13న బూత్‌లో ఓట్లు వేసేందుకు ఏయే ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారని ఆరా తీశారు. బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, వాహనాల నిలపుదల, ట్రాఫిక్ ఇతరత్రా అంశాలపై కూలకుషంగా పరిశీలించారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన జాగ్రత్తలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ శాఖల అధికారుల భాగస్వామ్యంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, నగరంపాలెం సీఐ మధుసూదనరావు ఉన్నారు.